ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ముస్తాక్ అలీని గెలిపించండి

ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్

కవాడిగూడ: ప్రజా సమస్యలపై గళం విప్పే మహ్మద్ ముస్తాక్ అలీని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మైనార్టీ బీసీ సామాజికవర్గానికి చెందిన ముస్తాక్‌అలీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని అన్నారు. ఆయనకు తమ పార్టీ ఇప్పటికే మద్దతు ప్రకటించిందన్నారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లలో ఆప్ శ్రేణులు మహ్మద్ ముస్తాక్ అలీ గెలుపుకోసం ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థి, నిరుద్యోగ, దళిత, మైనార్టీ, బీసీ సంఘాలు, ప్రజా సంఘాల మద్దతు ఆయనకే ప్రకటించాయని అన్నారు.కాంగ్రెస్, బీజేపీలు బీసీ, ఎస్సీ, ఎస్టీలను విస్మరించి రెడ్డి సామాజికవర్గానికే పెద్దపీట వేయడం దుర్మార్గమని అన్నారు. పట్టభద్రులు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో బిల్వార్చన

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలోని భవానీశంకర దేవాలయంలో మంగళవారం బిల్వార్చన పూజలు నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, అఖండ దీపారాధన తదితర పూజా కార్యక్రమాలను ఈఓ జ్యోతి పర్యవేక్షించారు. సుమారు 4 శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ ఆలయంలో జరిగిన బిల్వార్చనలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని భక్తులు తెలిపారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ బడ్జెట్‌లో విద్యారంగంతో పాటు యువజన మహిళా రంగాల అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య, యువజన సమాఖ్యల సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ... ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగం, ఉపాధికోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో జాబ్ కేలండర్‌ను ప్రకటించి ఆరు నెలల్లో 2లక్షలు ఉన్న ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కర్రా రాజిరెడ్డి, పల్లె మురళి, ఎ.వెంకట్, జి.అనసూయ, నాగరాజు, స్వరూప, జి.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకిస్తున్న కార్పొరేటర్ సుప్రియ

ముషీరాబాద్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ఆయా రంగాల్లో వారిని ప్రోత్సహించాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్ అన్నారు. మంగళవారం గంగపుత్రకాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. వ్యవసాయం, నేరాల అదుపు చేయడం, రోడ్డు ప్రమాదాల నివారణ, కాలుష్య రహిత సమాజ స్థాపన తదితర అంశాలపై విద్యార్థులు తయారు చేసిన నమూనాలు ఎంతో ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి జహంగీర్, స్కూల్ ప్రిన్సిపల్ అశోక్‌కుమార్, ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచికుమార్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో దూసుకుపోవాలి



సాక్షి,సిటీబ్యూరో: నారాయణగూడలోని నారాయణ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబర్చారు. తెలుగువారి పండగలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రదర్శించారు. చంద్రయాన్, మనిషి జీర్ణవ్యవస్థ తదితర అంశాలను వివరించారు. వివిధ వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన డా.వేదాంత్ సింగ్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో జ్ఞానం పెంచుకుంటూ విద్యార్థులు దూసుకుపోవాలని సూచించారు. స్కూల్ ఏడీ మనోహర్‌రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్, కో ఆర్డినేటర్ ఆజాద్, భవానీ, నూర్జహాన్, స్కూల్ ప్రిన్సిపాల్ హర్నిత్ కౌర్, వైస్ ప్రిన్సిపాల్ మోహిన్నిసా తదితరులు హాజరయ్యారు.

లింగోద్భవ కాలం.. మహా శివరాత్రి పర్వం

- మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైన శైవక్షేత్రాలు
- ఆదిదంపతుల కల్యాణానికి భారీ ఏర్పాట్లు

న్యూరామాలయంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి



శివ లింగంపై కాసిన్ని నీళ్లతో(గంగాజలం) అభిషేకం చేస్తే బోలా శంకరుడు సంతోషించి సర్వైశ్వర్యాలను ప్రసాదిస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి. అంత గొప్ప విశిష్టత కలిగిన శివలింగం ఆవిర్భవించిన మాఘమాసం కృష్ణపక్ష చతుర్దశి రోజున మహా శివరాత్రిని నిర్వహించుకుంటాం. ఈ నేపథ్యంలో మంగళవారం అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లోని దేవాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే శివయ్యకు అభిషేకం చేసేందుకు భక్తులు సిద్ధమయ్యారు.





శివరాత్రి వేడుకలకు ముస్తాబైన టీఆర్టీకాలనీ విజయగణపతి ఆలయం, శివం రోడ్డులోని లింగాలగడ్డ శివాలయం



బాకారంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారు





విద్యుద్దీపాల వెలుగులో వివేకనగర్ ఆంజనేయస్వామి ఆలయం, క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయం

నల్లకుంట: జోన్ పరిధిలోని శైవక్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. బుధవారం వేకువజాము నుంచే ఉత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించేందుకు శివాలయాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలోని శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, శివం రోడ్డులోని లింగాలగడ్డ శివాలయం, తిలక్‌నగర్‌లోని శివాలయం, టీఆర్టీ కాలనీలోని విజయ ఆంజనేయస్వామి ఆలయం, శివం మందిరం, నల్లకుంటలోని శంకరమఠంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

న్యూ రామాలయం ప్రాంగణంలోని శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వేకువజామున కలశ స్థాపన, నవగ్రహ పూజలు ఉంటాయి. ఈ సందర్భంగా ఏకవార రుద్రాభిషేకం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఉంటుంది. రాత్రి 10గంటలకు ఆదిదంపతుల కల్యాణోత్సవం, రాత్రి 12గంటలకు అన్నాభిషేకం ఉంటుంది.

లింగాలగడ్డ శివాలయంలో..

శివంరోడ్డులోని లింగాల గడ్డ శివాలయంలో ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు శివుడికి విశేష అభిషేక పూజలు ఉంటాయి. రాత్రి 10 గంటల వరకు మహా శివుడి దర్శనం ఉంటుంది.

శ్రీవిజయ గణపతి దేవాలయంలో..

టీఆర్టీకాలనీలోని శ్రీవిజయ గణపతి దేవస్థానంలో ఉదయం 6 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఉంటుంది. రాత్రి 9గంటలకు భవానీశంకర స్వామి కల్యాణం ఉంటుంది. రాత్రి 12గంటలకు లింగోద్భవకాల అభిషేకం, అనంతరం స్వామివారి ఊరేగింపు ఉంటుంది. అలాగే 26, 27 తేదీలలో రెండు రోజుల పాటు ఉదయం 6గంటలకు శివపంచాక్షరి అజపాజనం జరుగుతుంది.

నల్లకుంట శంకరమఠంలో..

నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఉంటాయి.

బాబా మందిరంలో..

బాగ్ అంబర్‌పేటలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో ఉదయం 6గంటలకు సాయిబాబాకు అభిషేకం, మంగళస్నానం, 8 గంటలకు నిత్యాన్నదానం ఉంటుంది. అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 7గంటలకు భజన ఉంటుంది. ఉండే భక్తుల సౌకర్యార్థం బుధవారం రాత్రి ఆలయం తెరిచే ఉంటుంది.

పూలు, పండ్ల విక్రయాలు షురూ..

శివం రోడ్డు, శంకరమఠం, గోల్నాక మార్కెట్ తదితర ప్రాంతాలలో పండ్లు, పూలు, పూజా సామగ్రి షాపులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

సైన్స్‌తోనే సామాజిక పురోగతి

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వర్‌రావు



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను తిలకిస్తున్న భూపతి వెంకటేశ్వర్లు



ఎస్వీకేంద్రంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సైన్స్‌తోనే సామాజిక పురోగతి లభిస్తుందని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వర్‌రావు అన్నారు. పాలకులు సైంటిఫిక్ ఆక్ష్యరాసులు కావాలని అభిలాషించారు. మంగళవారం తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెంకటేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. ప్రతి ప్రయోగాలు మానవ జీవితాన్ని సులభతరం చేయడానికి ఉపయోగపడాలని అన్నారు.

సైన్స్‌కు నమ్మకాలు, విశ్వాసాలు ఉండవు..

◆ తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... సైన్స్‌కు నమ్మకాలు, విశ్వాసాలు ఉండవని అన్నారు. అజ్ఞానం రాజమేలుతున్న తరుణంలో విజ్ఞానానికి పునాదులు వేయాలన్నారు.

అందు కోసమే పిల్లల్లో సృజనాత్మకత, సైన్స్ పట్ల అవగాహన పెంచేందుకు ఎగ్జిబిషన్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కార్యదర్శి సోమయ్య, ఉపాధ్యక్షురాలు సుజావతి, కోశాధికారి బుచ్చిరెడ్డి, నవీన్, బ్రాహ్మణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు సర్టిఫికెట్లను అందజేశారు.

అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను సందర్శించిన ట్రాఫిక్ డీసీపీ

అంబర్‌పేట: అంబర్‌పేట ఫ్లైఓవర్‌పై వాహనాలను అనుమతి ఇచ్చేందుకు మంగళవారం ట్రాఫిక్ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచనల నేపథ్యంలో ట్రాఫిక్ డీసీపీ ఎన్.అశోక్ ఇతర అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఫ్లైఓవర్‌పైన వాహనదారులకు ఎదురయ్యే ఇబ్బందులను పరిశీలించారు. అవసరమైన చోట్ల బారికేడ్లు తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాహనదారులను అనుమతించనున్న నేపథ్యంలో ట్రాఫిక్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీసీపీ వెంట ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, అంబర్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లెనిన్‌బాబు, ఇతర సిబ్బంది ఉన్నారు.



ఫ్లైఓవర్‌పై వాహనాలను అనుమతించే అంశాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ ఎన్.అశోక్

మాదిగలకు రెండు ఎమ్మెల్సీ పదవులివ్వాలి



బర్కత్‌పురలోని సామాజిక భవన్‌లో మాట్లాడుతున్న క్రాంతికర్

కాచిగూడ: మాదిగ ఉద్యమకారులకు ఒక ఎమ్మెల్సీ, బెడ బుడగ జంగం కులానికి ఒక ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి రాష్ట్ర చైర్మన్ క్రాంతికర్ పోకల కిరణ్ మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం బర్కత్‌పురలోని సామాజిక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఎమ్మెల్యే కోటా ద్వారా 5 ఎమ్మెల్సీ స్థానాల భర్తీ చేయనుందని అన్నారు. అన్ని రంగాల్లో అత్యంత వెనుకబడిన బెడ (బుడగ) జంగం కులానికి ఒక ఎమ్మెల్సీ స్థానం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎస్సీ వర్గాల్లో మాల, మాదిగల తర్వాత అత్యధిక జనాభా కలిగిన కులమైనా రాజకీయంగా ఎలాంటి అవకాశాలు రాలేదన్నారు. ఇప్పటికైనా మాదిగలకు ఎమ్మెల్సీ పదవులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోచి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ ప్రేమ్‌రాజ్, కొండ రాజు మాదిగ, జనార్దన్, మహేష్‌కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు

కాచిగూడ: నెక్లెస్‌రోడ్డులో భారతమాత మహాహారతి సందర్భంగా జనవరి 26న హుస్సేన్‌సాగర్ బోట్‌లో బాణసంచా పేలి నాగారం ప్రాంతానికి చెందిన చెరుపల్లి అజయ్ పద్మశాలి మరణించిన విషయం తెలిసిందే. మృతుడు అజయ్ పద్మశాలి కుటుంబానికి రూ.20లక్షల నగదుతో పాటు వారి కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగాన్ని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఇప్పించారు. నిరుపేద పద్మశాలి కుటుంబాన్ని ఆదుకున్న కిషన్ రెడ్డిని మంగళవారం గ్రేటర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ ఆధ్వర్యంలో పద్మశాలీల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



కవాడిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఓ గుర్తు తెలియని యువకుడు మృతిచెందిన సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 10వ తేదీన పెట్రోలింగ్‌లో భాగంగా పోలీసు సిబ్బంది ట్యాంక్‌బండ్‌పై కొందరు గుమికూడి ఉండడాన్ని గమనించారు. అక్కడికి చేరుకుని చూడగా 25 ఏళ్ల ఓ గుర్తుతెలియని యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఉన్నాడు. రోడ్డు దాటే సమయంలో యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు మానసికంగా వ్యాధిగ్రస్తుడు కావడంతో పోలీసులు ఎలాంటి వివరాలు చెప్పలేకపోయాడని తెలిపారు. మృతిడి ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పోలీసులు లేదా ఫోన్ నం.98495 63715కు సమాచారం అందించాలని కోరారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి

ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా దాని ఊసే ఎత్తడం లేదని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.ప్రదీప్, వి.అజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం మార్క్స్ భవన్‌లో పీవైఎల్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో పదేళ్లు ఉన్నా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేదన్నారు. ఆ తర్వాత నిరుద్యోగులు తమ శక్తిని ఎన్నికల్లో చూపించారని అన్నారు. ఇప్పుడు అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిరుద్యోగ భృతి వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల వసూళ్లపై ప్రభుత్వ నియంత్రణ లేదన్నారు. ఈ సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఎం.రవికుమార్, నాయకులు ఎస్.వి.రాకేష్, జె.భరత్, బి.కృష్ణ, రామకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

ఏఎల్ మల్లయ్య సేవలు చిరస్మరణీయం





ఏఎల్ మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, అంబటి సుధాకర్ తదితరులు

కవాడిగూడ: తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ చైర్మన్ స్వర్గీయ ఏఎల్ మల్లయ్య గంగపుత్రుల అభివృద్ధితో పాటు బీసీలలో ఎ,బీ,సీ,డీ వర్గీకరణ చేసే విషయంలో ముఖ్యపాత్ర పోషించారని నాయకులు పేర్కొన్నారు. ఏఎల్ మల్లయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా మంగళవారం బండమైసమ్మనగర్‌లోని ఆయన విగ్రహానికి సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గంగపుత్రుల సమస్యలపై పోరాడటమే ఏఎల్ మల్లయ్యకు మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. బీసీ సంఘం నేత మీన గోపితో పాటు గంగపుత్ర సంఘం నేతలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు.

ఏఎల్ మల్లయ్యకు నివాళి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఉభయ తెలుగు రాష్ట్రాలలో గంగపుత్రుల అభ్యున్నతికి ఏఎల్ మల్లయ్య చేసిన సేవలు చిరస్మరణీయం అని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం ఎస్వీకేంద్రంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం, గంగపుత్రుల విద్యావంతుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఏఎల్ మల్లయ్య ద్వితీయ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎల్ మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, రాష్ట్ర మత్స్యసహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్, అడిషనల్ డీసీపీ జె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బహుజన్ రాజ్యాధికార పార్టీ ఆవిర్భావ సదస్సు 12న

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన్ రాజ్యాధికార పార్టీ ఆవిర్భావ సదస్సును మార్చి 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అడాక్ కమిటీ కన్వీనర్ జన్ను సాంబయ్య, కోకన్వీనర్ బుర్రి సాగర్, రమేష్ తెలిపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... బహుజన గుండెచప్పుడుగా నిర్మితమవుతున్న ఈ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో అగ్రకుల రాజకీయ పార్టీలే రాజ్యమేలుతున్నాయని అన్నారు. అణచివేత, ఆర్థిక దోపిడీకి గురవుతూ రాజ్యాంగ ఫలాలకు దూరంగా ఉన్న బహుజనులంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.

'మాలలను రాజకీయంగా, సామాజికంగా అణచివేస్తున్నారు'



సమావేశంలో మాట్లాడుతున్న మాల సంఘాల జేఏసీ నాయకుడు బేర బాలకృష్ణ తదితరులు

కవాడిగూడ: తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మాల సామాజికవర్గాన్ని రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణచి వేస్తున్నారని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ నాయకుడు బేర బాలకిషన్ అన్నారు. మంగళవారం దోమలగూడలోని సామ్రాట్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జేఏసీ నాయకులతో కలిసి మాట్లాడారు. మాల ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం అంటే వివక్ష పాటించడమేనని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో మాలల పాత్ర ఉందనే విషయాన్ని సీఎం మరిచిపోయారని విమర్శించారు. చేవెళ్ల డిక్లరేషన్ సభలో ఎస్సీలకు 18శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణమాదిగ ఒత్తిడికి తలొగ్గి పనిచేస్తున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణతో ఎస్సీ ఉపకులాలకు మధ్య శాశ్వత ఘర్షణ వాతావరణం ఏర్పడుతుందన్నారు.

◆ ఇది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని పేర్కొన్నారు. 119 నియోజకవర్గాలలో ప్రతి శాసనసభ్యుడికి ఎస్సీ వర్గీకరణ వల్ల జరిగే ప్రమాదాన్ని సమగ్ర సమాచారంతో వినతి పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం చేయడానికి నియమించిన షమీమ్ అక్తర్ కమిషన్ రిపోర్టు పూర్తిగా తప్పుల తడకగా ఉందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఎస్సీల స్థితిగతులపై మాల, మాదిగ మేధావులతో సుదీర్ఘ చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ నాయకులు చెరుకు రాంచందర్, జంగా శ్రీనివాస్, మంచాల లింగస్వామి, దాసరి విశాల్, రఘునాథ్, తాలూకా రాజేష్, నర్సింహ, శ్రీహరి, గాదె కుమార్ తదితరులు పాల్గొన్నారు.